సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర

సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాకూర్ అన్నారు. 8లో▸



పత్తి క్వింటాల్‌కు రూ.7,809

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు మంగళవారం రూ.7,809 పలికింది. కనిష్టంగా రూ.6,921, సరాసరి రూ.7,701గా పలికిందని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
32.0/15.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఎండతీవ్రత, ఉక్కపోత ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వేలాలకు ఆర్టీసీ బస్సులు



మాట్లాడుతున్న డిపో మేనేజర్ పి.మల్లేశం

గోదావరిఖని టౌన్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని వేలాలలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు గోదావరిఖని, మంథని ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు ఆయా డిపోల మేనేజర్లు మల్లేశం, శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో గోదావరిఖని నుంచి 25కుపైగా బస్సులను ఇందారం మీదుగా నడిపిస్తామని మల్లేశం తెలిపారు. పెద్దలకు ఒక్కరికి రూ.70, పిల్లలకు రూ.40గా నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం వరకు బుధవారం నుంచి ప్రతిరోజు ఉదయం 5:30కు, 7 గంటలకు రెండు సూపర్ లగ్జరీ బస్సులు నడిపిస్తామన్నారు. మంథని నుంచి 16కు పైగా బస్సులను సుందిళ్ల బ్యారేజీ మీదుగా వేలాలకు నడపనున్నారు. పెద్దలకు ఒక్కొక్కరికి రూ.70, పిల్లలకు రూ.40గా నిర్ణయించినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

నేటి నుంచి పలు ప్యాసింజర్ రైళ్ల రద్దు

రామగుండం: కాజీపేట బల్హార్షా సెక్షన్.. వీరూర్, మకూడి రైల్వేస్టేషన్ల పరిధిలో మూడో రైల్వే లైన్ ఇంటర్ లాకింగ్ పనులు నిర్వహిస్తున్న క్రమంలో బుధవారం నుంచి ఈనెల 24 వరకు కాజీపేట-బల్హార్షా సెక్షన్ మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట-బల్హార్షా (ఇరువైపులా), సిర్పూర్ కాగజ్‌నగర్ - సికింద్రాబాద్ (ఇరువైపులా), నాందేడ్ - నిజామాబాద్ (ఇరువైపులా), కాచిగూడ-కరీంనగర్ (ఇరువైపులా), పూర్ణ - ఆదిలాబాద్, కాచిగూడ - నిజామాబాద్ (ఇరువైపులా), కాజీపేట - సిర్పూర్‌టౌన్, బల్హార్షా - కాజీపేట, సిర్పూర్‌టౌన్ - కరీంనగర్ (ఇరువైపులా) రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

'మన ఊరు - మనబడి' త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

ధర్మారం: మన ఊరు - మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ధర్మారం, జూలపల్లి మండలాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులతో సమీక్షించారు. ఉపాధి పథకం కింద చేపట్టిన పనులు, పురోగతి, బిల్లుల విషయమై చర్చించారు. మన ఊరు - మనబడి కింద బిల్లు వచ్చే పనులను కాంట్రాక్టర్లకు.. రాని పనులను సర్పంచులకు ఇవ్వటం ఎంతవరకు న్యాయమని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు అధికారులను ప్రశ్నించారు. పూర్తిచేసిన పనులకూ బిల్లులు రావటం లేదన్నారు. కుమార్ దీపక్ మాట్లాడుతూ మన ఊరు మన బడి పనులు చేసిన వెంటనే ఇంజినీరింగ్ అధికారులు రికార్డులు చేసి బిల్లు చెల్లించాలన్నారు. డీఆర్‌డీవో శ్రీధర్, ధర్మారం, జూలపల్లి ఎంపీడీవోలు జయశీల, వేణుగోపాల్, ముత్యాల బలరాం రెడ్డి, మార్కెట్ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

'కొండ'ంత ఆశలు..!

నేడు కొండగట్టుకు సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కొండగట్టు.. ఉమ్మడి జిల్లాలోనే కాదు.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకమైన చారిత్రక పుణ్యక్షేత్రం. ఉద్యమ సమయం నుంచి సీఎం కేసీఆర్ ఈ ఆలయం అభివృద్ధికి అనేక హామీలిచ్చారు. తాజాగా ఆలయం మాస్టర్‌ప్లాన్ కోసం రూ.100 కోట్లు కేటాయించారు. అంతేకాకుండా ఆలయం మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు స్వయంగా కొండగట్టుకు వస్తున్నారు. సీఎం వెంట యాదాద్రికి డిజైన్లు అందించిన ఆనంద్‌సాయి కూడా వస్తున్నట్లు సమాచారం. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ పుణ్యక్షేత్రానికి రామాయణ కాలం నుంచి ప్రత్యేక చరిత్ర ఉంది. ఇంతటి వారసత్వ సంపదను కాపాడుకునేందుకు ఎట్టకేలకు ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్న వేళ.. భక్తులంతా కొండంత ఆశలతో అనేక డిమాండ్లు వినిపిస్తున్నారు. సీఎం పర్యటన సందర్భంగా కొండగట్టుపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్..!





పునాదుల్లోనే ఆగిపోయిన మాల విరమణ మండపం పనులు



గతంలో నిర్మించిన గదులు

సీఎం కేసీఆర్ షెడ్యూల్ ఇదీ..

జగిత్యాల:
- సీఎం కేసీఆర్ బుధవారం ఉదయం 9గంటలకు హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ నుంచి బయలు దేరుతారు.
- నేరుగా బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడినుంచి హెలిక్యాప్టర్‌లో జగిత్యాలకు బయలుదేరుతారు.
- ఉదయం 9.45 గంటలకు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధికి చేరుకుంటారు.
- స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అధికారులతో సమావేశం నిర్వహిస్తారు.
- ఆలయ అభివృద్ధికి కేటాయించిన రూ.100 కోట్లు వెచ్చించి చేపట్టే ప్రగతి పనులపై సమీక్షిస్తారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి హైదరాబాద్‌కు హెలిక్యాప్టర్‌లో వెళ్తారు.
- మధ్యాహ్నం 1.40గంటలకు ప్రగతి భవన్ చేరుకుంటారు.



సీతమ్మ కన్నీటి ధారలు



కల్యాణకట్ట దుస్థితి

చారిత్రక ఆస్తి పరిరక్షణ

కొండపై అనేక చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. రామాయణకాలంలో లక్ష్మణుడిని కాపాడేందుకు సంజీవనని హనుమంతుడు ఎత్తుకుపోతున్న క్రమంలో ఆ గుట్ట నుంచి చిన్న ముక్క విరిగిపడిందని, అదే ప్రస్తుత కొండగట్టు అన్నది భక్తుల విశ్వాసం. 300 ఏళ్ల క్రితం ఆవులకాపరి స్వామివారికి చిన్న ఆలయాన్ని నిర్మించగా.. 160 ఏళ్ల కింద క్రిష్ణారావు దేశ్‌ముఖ్ ప్రస్తుత ఆలయాన్ని నిర్మించారని చరిత్ర చెబుతోంది. ఇక్కడ హనుమంతుడికి ద్వారపాలకుడిగా భేతాళుడు ఉండటం విశేషం. గుట్టపై భేతాళ స్వామి ఆలయం, సీతమ్మ కన్నీటిగుంటలు, మునుల గుహ, జలబుగ్గ, శ్రీరాముల ఆలయం, కొండలరాయుడి కోట, మెట్ల దారి తదితరాలను పరిరక్షించి, అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు కోరుతున్నారు.

- ఇటీవల రూ.100 కోట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి
- మౌలిక సదుపాయాలు, మాస్టర్‌ప్లాన్‌పై సమీక్ష
- ఆసుపత్రి, ఫైర్‌స్టేషన్, పీహెచ్‌సీ కావాలంటున్న భక్తులు
- హరిత హోటళ్లు, ఆన్‌లైన్ బుకింగ్‌లకు డిమాండ్
- రైల్వేస్టేషన్- కొండ మీదకు రవాణా మెరుగవ్వాలని కోరిక
- మానసిక చికిత్సాలయం ఉండాలంటున్న ఆరాధకులు
- 108 అడుగుల భారీ విగ్రహం ప్రతిష్ఠాపన?



ప్రసాదం తయారు చేసే కేంద్రం వెనుక అధ్వానంగా పరిసరాలు

అభివృద్ధి చేయాల్సినవి ఇవే..

- భేతాళ ఆలయం చెత్తాచెదారంతో నిండి పారిశుద్ధ్య సమస్య ఎదుర్కొంటోంది.
- మండువేసవిలోనూ ఎండని సీతమ్మవారి కన్నీటి గుంటలకు ప్రచారం కల్పించాలి.
- కొండగట్టుపై శ్రీరాముని ఆలయం ఉన్న విషయం చాలామందికి తెలియదు.
- వందల ఏళ్ల క్రితం తపస్సు చేసుకున్న 'మునులగుహ'కు కాలిబాట కూడా లేదు.
- కొండగట్టు ఘాట్ ప్రాంతం నుంచి కిందికి వెళ్లే క్రమంలో జలబుగ్గ అనే నీటి ప్రవాహం కనిపించకుండా పోయింది.
- ఒకప్పుడు బల్మూరి వంశానికి చెందిన కొండలరాయుడి కోట, గుట్టకు మరింత ప్రచారం కల్పించాలి.
- గుట్ట మీద 108 అడుగుల భారీ ఆంజనేయుడి విగ్రహం ఏర్పాటును సీఎం ప్రకటిస్తారని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మాస్టర్‌ప్లాన్‌లో వీటిని చేర్చాలి

- ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు. సమీపంలోని రైల్వేస్టేషన్‌తో కనెక్టివిటీ కల్పించాలి. భక్తుల వాహనాలకు పార్కింగ్ సమస్య తీర్చాలి.
- కొండగట్టులో మానసిక వ్యాధులు నయమవుతాయని నమ్మకం. అందుకే ఇక్కడ మానసిక చికిత్సాలయం ఏర్పాటు చేయాలి.
- కొండగట్టు పుణ్యక్షేత్రం దర్శనం, గదులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం కల్పించాలి. ఏటీఎం, నెట్‌వర్క్ టవర్లను ఏర్పాటు చేయాలి. భక్తులకు తాగునీటి కొరత తీర్చాలి. హరితతోపాటు ప్రైవేటు హోటళ్ల ఏర్పాటు చేసి ఆతిథ్యరంగాన్ని ప్రోత్సహించాలి.
- కొండగట్టుపై జరిగే అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌స్టేషన్, శాంతి భద్రతల నియంత్రణకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్లు అవసరం.
- స్థానికంగా ఆసుపత్రి లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి. 2018లో ఇక్కడ ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైనపుడు ఆసుపత్రి లేని లోటు స్పష్టంగా కనిపించింది.
- లక్షలాది మంది హనుమాన్ దీక్షాపరుల మాల విరమణకు ప్రత్యేక మండపం కావాలి.
- తలనీలాలు సమర్పించే కల్యాణకట్టపై గద్దెలు, నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి.
- కొండపై నిత్యం 100 మందికి, మంగళ, శనివారాల్లో 200 మంది భక్తులకు భోజనం పెడుతున్నారు. ఈ సామర్థ్యాన్ని 1000 మందికి పెంచాలి.
- మెట్లదారి, కోనేరు, డ్రైనేజీలు అధ్వానంగా మారాయి. వెంటనే మరమ్మతులు చేయాలి.

భక్తుల సమస్యలు తీర్చండి



కొండగట్టు ఆలయానికి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు రూ.100 కోట్లు ఇవ్వడం గొప్ప విషయం. పార్కింగ్, గదులు, తాగునీరు సమస్యలను తీర్చి, ఆలయ పరిసరాలను మరింత అభివృద్ధి చేయాలి.
– ఆరోహి, భక్తురాలు హైదరాబాద్

అభివృద్ధి కోసమే నిధులు

కొండగట్టు ఆలయానికి రూ.100 కోట్లతో మాస్టర్‌ప్లాన్ రూపొందించడం సంతోషం. ఇక ఆలయ అభివృద్ధి వేగం అందుకుంటుంది. పరిసరాలు మెరుగుపడి, స్థానికంగా మరింత మందికి ఉపాధి అవకాశాలు అందివస్తాయి.
– బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచ్ ముత్యంపేట

చరిత్రాత్మక నిర్ణయం



రూ.100 కోట్లతో కొండగట్టుకు మాస్టర్ ప్లాన్ రూపకల్పన చరిత్రాత్మక నిర్ణయం. ఈ నిర్ణయంతో ఆలయ చరిత్రలో కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారు. పుణ్యక్షేత్రానికి జాతీయస్థాయిలో ప్రచారం కల్పించడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచడం, పర్యాటకంగా మరో యాదాద్రిలా మార్చాలన్న పట్టుదలతో సీఎం మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు.
– సుంకె రవి శంకర్, ఎమ్మెల్యే చొప్పదండి

అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలి

- ఈనెల 20 వరకు పనులు పూర్తి కావాలి
- కలెక్టర్ సంగీత వెల్లడి



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

సుల్తానాబాద్: పట్టణంలో చేపడుతున్న పనుల్లో పురోగతి కనిపించాలని కలెక్టర్ సంగీత అన్నారు. ఈనెల 20 వరకు స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం ఆధునీకరణ పనులు పూర్తి కావాలని ఆదేశించారు. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం ఆధునీకరణ పనులను మంగళవారం తనిఖీ చేసి సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం ప్రతి హాస్టల్‌కు రూ.5లక్షల చొప్పున గతంలో రూ.45 లక్షలు మంజూరు చేసిందని ఇప్పటివరకు ఆరు వసతి గృహాల పనులు పూర్తయ్యాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం మండలంలోని వివిధ అభివృద్ధి పనులపై తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది కలగకుండా మిషన్ భగీరథ పైప్‌లైన్ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. రెండు వైకుంఠధామాలను వినియోగంలోకి తేవాలని, సీసీ రోడ్ల పనులను మార్చి చివరిలోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. మండలంలో 39 సీసీ రోడ్లకు రూ.2.86కోట్లు మంజూరయ్యాయని, ఇప్పటివరకు రూ.28లక్షల విలువైన నాలుగు పనులు పూర్తిచేశామని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. మన ఊరు - మనబడి కింద రెండు పాఠశాలల్లో పనులే మొదలుపెట్టలేదని తెలుసుకుని వెంటనే సర్పంచ్‌తో మాట్లాడారు. అధికారులు రోజుకో పాఠశాలను సందర్శించి పూర్తయిన, పెండింగ్ పనులను నివేదించాలన్నారు. మండలంలో నిర్మాణ దశలో ఉన్న 80 డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణికి వచ్చిన అర్జీలను పరిష్కరించాలని, మరోసారి అలాంటి సమస్యతో రాకుండా చూడాలన్నారు. తహసీల్దార్ యాకన్న, ఎంపీడీఓ శశికళ, ఇరిగేషన్ మధుమతి, ప్రవీణ్, ఏఈ సతీష్, నాయబ్ తహసీల్దార్ సదానందం, రెవెన్యూ సెక్షన్ అధికారి కోటేశ్వర్‌రావు, ఆర్‌ఐలు స్వాతి, శ్రీవాణి ఉన్నారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

అర్హులందరూ కంటి పరీక్షలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేశామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సంగీత తెలిపారు. పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేశారు. కళ్లద్దాలు సరిపడా ఇవ్వడం లేదని స్థానిక డాక్టర్లు, అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అర్బన్ కేంద్రాలకు అధికంగా కేటాయించేలా చూడాలన్నారు. మండలంలో సర్వేయర్ లేకపోవడంతో భూముల హద్దులు నిర్ణయించేందుకు ఇబ్బంది కలుగుతోందని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఫకీర్ యాదవ్ కలెక్టర్‌కు విన్నవించారు.

క్లుప్తంగా

చీఫ్‌విప్‌ను సన్మానించిన 'కోలేటి'



సన్మానిస్తున్న కోలేటి దామోదర్

గోదావరిఖని: శాసనమండలి చీఫ్ విప్‌గా నియమితులైన తానిపర్తి భానుప్రసాదరావును మంగళవారం రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ కలుసుకున్నారు. ఆయనకు అభినందనలు తెలిపారు. శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందించారు. విద్యాధికుడిగా పేరు తెచ్చుకుని.. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన భానుప్రసాదరావు చీఫ్‌విప్‌గా ఎన్నికవడం సంతోషంగా ఉందన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంవీఐ భీంసింగ్

జ్యోతినగర్(రామగుండం): వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని రామగుండం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ భీంసింగ్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని సిద్ధి శ్రీ వినాయక హీరో షోరూంలో నూతనంగా మార్కెట్‌లోకి వచ్చిన జూమ్–110 సీసీ స్కూటర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతరానికి అనువుగా ఉన్న ద్విచక్రవాహనాలను సరైన విధంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ నాగరాజు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

'పుల్వామా' వీరజవాన్లకు నివాళి



జైజవాన్ ఆకారంలో విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పుల్వామా ఘటనలో అమరులైన వీరజవాన్లకు మంగళవారం పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అంతకు ముందు విద్యార్థులు జైజవాన్ అంటూ నినాదాలు చేస్తూ జైజవాన్ ఆకారంలో మానవహారంగా ఏర్పడ్డారు. ఉగ్రవాదుల దాడిలో 2019 ఫిబ్రవరి 14న పుల్వామా ఘటనలో అమరులైన వీరజవాన్లను స్మరించుకుని 2నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్, ఏవో సురేశ్, రాజిరెడ్డి, హెచ్‌వోడీలు నటరాజన్, స్వాతి, పద్మిని, వంశీ తదితరులున్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు గడువు పెంపు

రామగుండం: మోడల్ (ఆదర్శ) విద్యాలయాల్లో ప్రవేశాల దరఖాస్తులకు ఈనెల 22 వరకు గడువు పెంచినట్లు లింగాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సారాతస్నీమ్ తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 16న నిర్వహించి మే 15న ఫలితాలు ప్రకటించనున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో

మెరుగైన వైద్యం..!

'సాక్షి'తో జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్ శ్రీధర్



- అందుబాటులో ఆధునిక వైద్యం
- సిబ్బందితో ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయండి
- మాతాశిశు కేంద్రంతో పెరిగిన ప్రసూతి సేవలు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వాసుపత్రులు ప్రైవేట్‌కు దీటుగా వైద్యం అందిస్తున్నాయి. ప్రభుత్వం జిల్లా కేంద్ర ఆసుపత్రి, మంథని, సుల్తానాబాద్‌లోని ఆసుపత్రులను ఆధునిక వసతులతో నిర్మించి అనేక సేవలను అందుబాటులోకి తెచ్చింది. నియోజకవర్గానికో మాతాశిశు కేంద్రం ఉండడంతో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లా ఆసుపత్రిలో టి–హబ్‌ను అందుబాటులోకి తెచ్చి అన్ని రకాల లాబోరేటరీ పరీక్షలు ఉచితంగా చేయనున్నారు. జిల్లాకేంద్రంతోపాటు పరిసర ప్రాంతాల డయాలసిస్ రోగులకోసం ఐదు పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఈ క్రమంలో ఆసుపత్రుల్లో అందుతున్న వైద్యంపై జిల్లా ప్రభుత్వాసుపత్రుల సూపరింటెండెంట్ శ్రీధర్ 'సాక్షి'కి మంగళవారం ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి: ప్రభుత్వాసుపత్రుల్లో ఎలాంటి సేవలు అందుతున్నాయి..?

డీసీహెచ్‌ఓ: జిల్లా కేంద్రంతోపాటు మంథని, సుల్తానాబాద్ ఆసుపత్రులకు వచ్చే రోగులకు అన్నిరకాల వైద్య సేవలందిస్తున్నాం. అవసరమైన మందులు, శస్త్రచికిత్సకు అవసరమైన వసతులున్నాయి.

సాక్షి: వైద్యులు, సిబ్బంది సరిపడా ఉన్నారా..?

డీసీహెచ్‌ఓ: ఆసుపత్రుల్లో గైనకాలజీతోపాటు చిన్నపిల్లలకూ వైద్యమందిస్తున్నాం. కంటి, దంత, చెవి, ముక్కు సమస్యలతో వచ్చే వారికీ సేవలందించే సిబ్బంది ఉన్నారు. కొద్ది నెలల క్రితం సైకియాట్రిస్టును నియమించాం.

సాక్షి: బీపీ, షుగర్ పరీక్షలు ఎలా సాగుతున్నాయి..?

డీసీహెచ్‌ఓ: జిల్లా ఆసుపత్రిలో రోజుకు 500మందికి పైగా ఓపీ వస్తారు. వారిలో చాలామంది బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఎన్‌సీడీ కిట్లను అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం.

సాక్షి: ప్రసూతి సేవలెలా అందుతున్నాయి..?

డీసీహెచ్‌ఓ: మాతాశిశుకేంద్రాలు నియోజకవర్గానికి ఒకటి అందుబాటులోకి వచ్చింది. ప్రసూతివైద్యం మెరుగ్గా అందుతుండడంతో డెలివరీల సంఖ్య పెరిగింది. అక్టోబర్‌లో 244 డెలివరీలు జరిగాయి.

సాక్షి: రక్తనిధిలో నిల్వలు ఉంటున్నాయా..?

డీసీహెచ్‌ఓ: మాతాశిశు కేంద్రాలున్న ఆసుపత్రుల్లో బ్లడ్‌బ్యాంకులు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉన్నా.. ఇబ్బందిలేకుండా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. అవసరమైన రక్తం అందుబాటులో ఉంది.

సాక్షి: శస్త్రచికిత్స చేసే అవకాశముందా..?

డీసీహెచ్‌ఓ: ఆసుపత్రుల్లో స్కానింగ్ యంత్రాలున్నాయి. జిల్లా ఆసుపత్రిలో డిజిటల్ ఎక్స్‌రే మిషన్ కూడా ఉంది. ఆర్థో, హెర్నియా, హైడ్రోసిల్ వంటి ఆపరేషన్లు చేస్తున్నాం. కంటి పరీక్షలు చేసే వైద్యులున్నా.. ఆపరేషన్లు అవసరమైతే కరీంనగర్ తీసుకెళ్లి చేయిస్తున్నాం.

సాక్షి: డయాలసిస్ సేవలు ఎప్పట్నుంచి అందిస్తారు..?

డీసీహెచ్‌ఓ: జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు ఇచ్చింది. ఈ ప్రాంతంలో 169మంది డయాలసిస్ పేషెంట్లు ఉన్నారు. మార్చి మొదటి వారం నుంచి సేవలందిస్తాం.

సాక్షి: లాబోరేటరీ సేవలందిస్తున్నారా..?

డీసీహెచ్‌ఓ: ఆసుపత్రిలో లాబోరేటరీ సేవలు మెరుగ్గా అందిస్తున్నాం. త్వరలోనే టి–హబ్ కూడా అందుబాటులోకి వస్తుంది. అపుడు మరింత మెరుగ్గా సేవలందుతాయి. ఇప్పటికే బ్లడ్, లివర్, ఈసీజీ, ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ తదితర సేవలను అందిస్తున్నాం.

సాక్షి: రక్తహీనత నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు..?

డీసీహెచ్‌ఓ: రక్తహీనత ఎక్కువగా మహిళల్లో కనిపిస్తోంది. గర్భం దాల్చిన వారికి పరీక్షలు చేసి రక్తం వృద్ధికి ఐరన్, ఫోలిక్‌యాసిడ్ వంటి మాత్రలు అందిస్తున్నాం. ప్రసూతి సమయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

సాక్షి: ఇన్‌పేషంట్లకు నాణ్యమైన ఆహారం..?

డీసీహెచ్‌ఓ: ఇన్‌పేషంట్లుగా ఉన్న వారికి పాలు, బ్రెడ్, టిఫిన్, భోజనం అందిస్తున్నాం. నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకున్నాం.

సాక్షి: జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం కోసం ఇబ్బందులున్నాయా..?

డీసీహెచ్‌ఓ: జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం గది నిర్మిస్తున్నాం. అందులో రెండు మృతదేహాలను భద్రపర్చేలా ఫ్రీజర్ కూడా వచ్చింది. రాత్రి సమయాల్లోనూ పోస్టుమార్టం చేసేలా వెలుగుకోసం వెయ్యి వాట్ల లైట్ అమర్చుతాం.

కాంగ్రెస్ పాలనంతా కుంభకోణాలమయం

- బీఆర్‌ఎస్‌ది కుటుంబపాలన
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సోమారపు సత్యనారాయణ



మాట్లాడుతున్న సోమారపు సత్యనారాయణ

జ్యోతినగర్: కాంగ్రెస్ పాలనంతా కుంభ కోణాలమయమని, బీఆర్‌ఎస్‌ది కుటుంబ పాలన అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సోమారపు సత్యనారాయణ అన్నారు. మంగళవారం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌లో మల్కాపూర్ శక్తి కేంద్రం ఇన్‌చార్జి గాండ్ల స్వరూప అధ్యక్షతన ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ప్రధాని మోదీ పేదలకు అందుబాటులో ఉంటూ అవినీతికి తావు లేకుండా సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. బంగారు తెలంగాణ నిర్మిస్తానని గొప్పలు చెప్పిన సీఎం కేసీఆర్ ఆయన కుటుంబాన్ని మాత్రమే బంగారు కుటుంబంగా మార్చుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకొస్తేనే సుపరిపాలన సాధ్యమన్నారు. సమావేశంలో 41, 42, 43వ బూత్ అధ్యక్షులు పెంట కుమార్, కాంపల్లి రవి, బాగాల స్వామి, కార్పొరేషన్ అధ్యక్షుడు గుండబోయిన లక్ష్మణ్ యాదవ్, రైల్వేబోర్డు మెంబర్ క్యాతం వెంకటరమణ, సోమారపు లావణ్య, అరుణ్ కుమార్, మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్ కుమార్, గాండ్ల ధర్మపురి, నాగరాజు, కమలాకర్, ప్రతాపరాజు, కస్తూరి సత్యప్రకాష్ పాల్గొన్నారు.

కుక్కలగూడూర్‌లో..

పాలకుర్తి: ప్రగతిభవన్ కేంద్రంగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని సోమారపు సత్యనారాయణ అన్నారు. మండలంలోని కుక్కలగూడూర్‌లో జరిగిన బీజేపీ శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన రాష్ట్రాన్ని కేసీఆర్ దోచుకుంటున్నారని ఆరోపించారు. కుక్కలగూడూర్, వేంనూర్ శక్తి కేంద్రం ఇన్‌చార్జి ఎల్క సంతోష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పత్తి సంజీవ్, ప్రధాన కార్యదర్శి బాలసాని మల్లేశం, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మాదాసు రాజేశం, బీసీ మోర్చా అధ్యక్షుడు కొత్తూరి విజయేందర్, బత్తిని చంటి, రమేశ్ పాల్గొన్నారు.

ముగిసిన వ్యవసాయ నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త వినాయక్

రామగిరి(మంథని): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రెండు రోజులుగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యవసాయ నైపుణ్య శిక్షణ మంగళవారం ముగిసింది. ఉపాధి హామీ పథకంలో 100రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న సభ్యులకు రామగిరి ఖిలా కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో వివిధ వ్యవసాయ నైపుణ్యాల గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకన్న, డాక్టర్ కిరణ్ పిల్లి, డాక్టర్ బి.భాస్కర్‌రావు, డాక్టర్ వినాయక్ పంటల్లో ఆశించే చీడపీడల నివారణ, వరిలో జింక్ లోపాన్ని గుర్తించడం, దాని నివారణ చర్యలు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగులో మెలకువలు, సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతుల గురించి సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఏపీఎం శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ ట్రైనర్ రవి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వేణుమాధవ్, ఏపీవో దయామణి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతదేవోభవ అవార్డుకు ఎంపిక



సురేశ్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీకి చెందిన వైకే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కండెం సురేశ్ రక్తదాత దేవోభవ అవార్డుకు ఎంపికైనట్లు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అమరేశ్ తెలిపారు. వైకే ఫౌండేషన్ ద్వారా 4,564 మందికి రక్తదానం, 31 సార్లు సురేశ్ రక్తదానం చేసినందుకు అవార్డుకు ఎంపికయ్యాడు. త్వరలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామంలో హెల్త్ వెల్ నెస్ సెంటర్‌ను సర్పంచ్ చిట్టబోయిన స్వరూప, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, జిల్లాలో 66 హెల్త్ వెల్ నెస్ సెంటర్లు, 2 బస్తీ దవాఖానాలు, 6 యూపీహెచ్‌సీలు, 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హెల్త్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెల్త్ మేళాలో టీబీ నిర్ధారిత పరీక్షలు, అసంక్రమిత వ్యాధులు, మైనర్ ఎలిమెంట్స్, క్యాన్సర్ పరీక్షలు, డయాబెటీస్, హైపర్ టెన్షన్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్ రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్ కార్యక్రమంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కృపాబాయి, ఎంపీడీవో లత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత భవాని, కోఆర్డినేటర్ డాక్టర్ మహేందర్, ఉపసర్పంచ్ మేకల రాజ్‌కుమార్, రాజేందర్, సుధాకర్, సతీష్, చిట్టబోయిన రాజ్‌కుమార్, రవి, పురుషోత్తం, దివ్యాంజలి, నిహారిక, వినోద, శారద, సమత, మాధవి, స్వరూప పాల్గొన్నారు.

కామర్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



కాంపెల్లి అర్జున్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కామర్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న కాంపల్లి అర్జున్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. 'రోల్ ఆఫ్ నాబార్డ్ ఇన్ డెవలప్‌మెంట్ ఆఫ్ రూరల్ ఇండియా'..ఎ స్టడీ ఆఫ్ నాబార్డ్ రీ ఫైనాన్సింగ్ టు డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ విత్ రిఫరెన్స్ టు తెలంగాణ రీజియన్, అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈసందర్భంగా అర్జున్‌ను కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు అభినందించారు. పెద్దపల్లి మండలం నిమ్మనపల్లికి చెందిన అర్జున్ 2013లో ఏపీపీఎస్సీ ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో విధుల్లో చేరారు.

సింగరేణి ప్రైవేటీకరణకు ప్రభుత్వాల కుట్ర



మహిళలతో మాట్లాడుతున్న ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: లాభాల్లో కొనసాగుతున్న సింగరేణిని నష్టాలబాట పట్టించి ప్రైవేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాకూర్ అన్నారు. హాథ్‌సేహాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక 13, 35వ డివిజన్‌లలో పర్యటించారు. సింగరేణి కార్మికుల శ్రేయస్సును ఆలోచించిన కాంగ్రెస్.. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న 17వేల మందికి స్థలాలు క్రమబద్ధీకరించిన విషయాన్ని గుర్తు చేశారు. రామగుండంలో అవినీతి పాలన సాగుతోందని, పరిశ్రమల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించకపోగా.. అమాయకుల నుంచి తన అనుచరులతో ఎమ్మెల్యే వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటివరకూ ఏ ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాలేదన్నారు. దళితబంధు పథకాన్ని తన అనుచరులకే కేటాయించారన్నారు. పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యాత్ర చైర్మన్ ఎండీ.ముస్తఫా, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ముదాం శ్రీనివాస్, నాయకులు పాయిల స్రవంతి, సతీశ్, గాజుల కిరణ్, చుక్కల శ్రీనివాస్, పాతిపెల్లి రవికుమార్, పాయిల సురేశ్, గట్ల రమేశ్, తాళ్లపల్లి యుగేందర్, పంజా శ్రీనివాస్, ఖాజా నజీమొద్దీన్, బూర్ల శ్రీనివాస్, ఎర్ర మధు, దూళికట్ట సతీశ్, కౌటం సతీశ్, నంది వెంకటేశ్, కిరణ్, మహేశ్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

యువ ఉద్యోగుల పాత్ర కీలకం



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం కె.నారాయణ

- ఆర్జీ–1 జీఎం కె.నారాయణ

గోదావరిఖని(రామగుండం): సంస్థ పురోభివృద్ధిలో యువ ఉద్యోగుల పాత్ర కీలకమని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ పేర్కొన్నారు. మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా దిగిపోయిన కార్మికుల పిల్లలకు మంగళవారం జీఎం కార్యాలయం ఆవరణలో కారుణ్య నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ, సంస్థలో చేరే యువ ఉద్యోగులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పని నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. సీనియర్ ఉద్యోగుల సూచనలు, సలహాలు పాటిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, సీఎంఓఏఐ అధ్యక్షుడు పానొగోటి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, సీనియర్ పీఓ శ్రావన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త నామినేషన్ ఫారాలు అందజేయాలి



మాట్లాడుతున్న హరి పచౌరి

రామగిరి(మంథని): సింగరేణిలో పని చేస్తున్న ఉద్యోగులందరూ కొత్త నామినేషన్ ఫారాలను సీఎంపీఎఫ్ కార్యాలయంలో అందజేయాలని సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ హరి పచౌరి సూచించారు. సెంటినరీకాలనీలోని జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో సీఎంపీఎఫ్ అధికారులు, సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులతో మంగళవారం నిర్వహించిన సీఎంపీఎఫ్ సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు బ్యాంక్ అకౌంట్లను ఫార్మర్ లేదా సర్వైవర్‌గా మార్చుకుంటే అవసరమైనపుడు మాజీ ఉద్యోగుల భార్యలకు విడో పెన్షన్‌ను వెంటనే సెటిల్ చేయవచ్చని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల వద్ద 7శాతం సీఎంపీఎఫ్ రికవరీ చేసి సీఎంపీఎఫ్‌కు జమ చేయాలన్నారు. అనంతరం ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సంక్షేమాధికారులు ఉద్యోగుల పర్సనల్ ఫైల్స్ తనిఖీ చేసి లోపాలుంటే సవరించాలని ఆదేశించారు. సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గౌతం శంకరయ్య, ఎస్‌వోటూ జీఎంలు డి.బైద్య, జి.రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, సీఎంపీఎఫ్ అధికారులు నఫీజ్ ఆలం, బి.పి. చక్రవర్తి, ఐ.డి.సాయి శివరాం, ప్రాజెక్టు అధికారి రమేష్, పర్సనల్ డీజీఎం విలాస్ శ్రీనివాస్ పోద్దార్, డీవైపీఎం మారుతి, గనుల పిట్ సెక్రెటరీలు కోడూరి రాజయ్య, వేముల రవిశంకర్, దాసరి మల్లేష్, వేగొలం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్జీ–1 జీఎం



కలెక్టర్‌తో సమావేశమైన జీఎం నారాయణ

గోదావరిఖని(రామగుండం): జీడీకే–11వ గని విస్తరణతో మైనింగ్ ఆపరేషన్స్ పనులు నిలిచిపోయాయని చందనాపూర్ ఎస్సీకాలనీని వెంటనే సంస్థకు అప్పగించేలా చూడాలని కోరుతూ మంగళవారం ఆర్జీ–1 జీఎం కె.నారాయణ, కలెక్టర్ సంగీత సత్యనారాయణను కలిశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశారు. సింగరేణి ద్వారా కొంత మొత్తం స్టూడెంట్ కూలి కింద డిపాజిట్ చేయాలని సూచించినట్లు తెలిపారు. సుందిల్ల మైనింగ్ లీజును కూడా పరిశీలించాలని తెలిపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నర్సింహామూర్తి, ఆర్డీవో వీరబ్రహ్మచారి, ఎస్టేట్ అధికారి బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం



డ్రైవింగ్ శిక్షణ ప్రారంభిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా సింగరేణి యాజమాన్యం ముందుకు వెళ్తోందని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అబ్దుల్‌కలాం స్టేడియంలో ఉచిత మోటార్ డ్రైవింగ్ శిక్షణను ప్రారంభించారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు పరిసర, ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. మోటార్ డ్రైవింగ్ శిక్షణ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి దొరికి ఆర్థికంగా రాణించే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, సర్పంచ్ కొండ వెంకటేష్, ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్ సలీం, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, పర్యావరణ అధికారి రాజారెడ్డి, సీనియర్ పర్సనల్ అధికారి వేణుగోపాల్, వెంకట్రావ్‌పల్లి గ్రామ స్పెషల్ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ ప్రమాణాలు పాటించాలి

గోదావరిఖని(రామగుండం): ప్రమాదాల నివారణకు రక్షణ ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ సూచించారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సేఫ్టీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, డీజీఎంఎస్ సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం సలీం, మోహన్‌రెడ్డి, రవీందర్, దుర్గాప్రసాద్, సదానందం, మురళీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.